క్లుప్తంగా

ముస్తాబవుతున్న గణనాథులు



అంబాజీపేటలో గణనాథుడి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు అజయ్

అంబాజీపేట: భక్తుల నుంచి తొలి పూజలు అందుకుని విఘ్నాలను తొలగించే అధినాయకుడు మహాగణపతి నవరాత్రుల ఉత్సవాలు మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 7న భాద్రపద శుద్ధ చవితి రోజు ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు జరిగి వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు ముస్తాబవుతున్నారు. అంబాజీపేటలో గుజరాత్‌కు చెందిన కళాకారులు చౌక్ మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీరు విగ్రహాలు తయారు చేసి అమ్మేయగా వచ్చే సొమ్ముతోనే బతుకుతున్నామని కళాకారుడు విజయ్ చెబుతున్నాడు. ప్రస్తుతం చౌక్ మట్టితో తయారు చేసిన విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఆకృతిని బట్టి రూ.3 వేల నుంచి రూ.40 వేల ధర వరకు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీలు అడ్వాన్సులు ఇచ్చి వెళ్లారు. వారికి నచ్చిన విధంగా విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది ఇస్తున్నామన్నారు. మండలంలో 16 గ్రామాలకు సంబంధించి 90 వరకు చలువ పందిళ్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రోగికి రూ.20 వేల సాయం



సహాయం అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ రాంబాబు

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన గోవిందవర్జుల శ్రీనివాసరావు భార్య హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. ఆమె వైద్య సేవల కోసం నామన ఫౌండేషన్ ద్వారా సోమవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. జెడ్పీ మాజీ చైర్మన్, ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, డాక్టర్ నామన వినోద్ ఈ సహాయాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఉండ్రు శ్రీరామారావు, కుంపట్ల బాబ్జి, నామన రమేష్, గోవిందవర్జుల మహేంద్ర పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.10 వేల సాయం



బాధితుడి భార్యకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బుర్రి రఘుబాబు వయస్సు 46 సంవత్సరాలు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. లివర్ మార్పిడి ఆపరేషన్ చెయ్యాలి అని వైద్యులు తెలిపారు. ఆయన భార్య అంగన్‌వాడీ టీచర్. ఇద్దరు ఆడ పిల్లలు వైద్యం చేయించుకునే స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా మహేంద్రవాడలో సంస్థ సభ్యులు చేతుల మీదుగా రఘుబాబు భార్యకి రూ.10 వేలు నగదును ఆర్థిక సాయంగా అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

విఘ్నేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు సూర్యనారాయణమూర్తి లఘున్యాస, ఏకాదశ అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి అన్నదానం సత్రంలో అధిక సంఖ్యలో స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామ సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. అమలాపురం ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు బీపీ, సుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



పోలీసుల పర్యవేక్షణ ఉండాలి

ఆసుపత్రులు వద్ద నైట్ వాచ్‌మెన్‌లతో పాటు పోలీసుల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి. అప్పుడే నైట్ డ్యూటీ చేసే వైద్య సిబ్బందికి భరోసా కలుగుతుంది. ఆసుపత్రుల్లో డ్యూటీ డాక్టర్‌కు ప్రత్యేక రూం ఏర్పాటు చేయాలి. మహిళలను, మహిళా వైద్యుల రక్షించేలా ప్రభుత్వం చూడాలి.

– పీజే గాయత్రి, వైద్యురాలు, పీహెచ్‌సీ, సఖినేటిపల్లి





మనోధైర్యం నింపేలా చర్యలుండాలి

ఆసుపత్రుల్లో నైట్ డ్యూటీలో ఉండే మహిళా వైద్యుల్లో మనోధైర్యం నింపేలా ఇకపై మరిన్ని చర్యలు ఉండాలి. కోల్‌కతా ఘటన నేపథ్యంలో నైట్ డ్యూటీ చేసే ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోతే చాలా కష్టం. నిత్యం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఉంటున్న వైద్య సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉండాలి.

– దుర్గా కావ్య, వైద్యురాలు, పీహెచ్‌సీ, సఖినేటిపల్లి



అలమూరులో శ్రీకృష్ణునికి అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ పురోహితులు



మాచవరం దొమ్మేటివారిపాలెంలో శ్రీకృష్ణునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పి.గన్నవరంలో ప్రత్యేకాలంకరణలో రాధాకృష్ణుల విగ్రహాలు



కొత్తపేటలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో బాలబాలికలు

ముకుందా.. ముకుందా..

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



అప్పనపల్లిలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అలమూరులో నూతనంగా నెలకొల్పిన శ్రీకృష్ణుని ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీవేదుల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంబాజీపేట: కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అంబాజీపేట, మాచవరం, నందంపూడి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో శ్రీకృష్ణ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణునికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణునికి పంచామృతాభిషేకాలను నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు.

పి.గన్నవరం: స్థానిక పట్టాభి రామాలయం వద్ద శ్రీకృష్ణాష్టమి మహోత్సవాలను గరుడవేగ టీమ్, రామసేతు భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి ఉయ్యాల సేవ, మహా హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక సామాజికవేత్త అనంతలక్ష్మి ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

రాజోలు: స్థానిక గోశాలలో సోమవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపికల వేషధారణలతో చిన్నారులు స్థానికులను అలరించారు. అలాగే వేషధారణలతోనే ఉట్టి కొట్టారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేసిన చిన్నారులకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

మామిడికుదురు: కృష్ణాష్టమి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అప్పనపల్లిలో ప్రధాన కార్యక్రమం జరిగింది. పాతగుడి వద్ద యువకుల ఆధ్వర్యంలో, రేవులో యాదవ సంఘం ఆధ్వర్యంలోను వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాతగుడి వద్ద 32 రకాల ప్రసాదాలను నైవేద్యంగా చెల్లించారు.

కొత్తపేట: స్థానిక కాంతిభారతి విద్యా సంస్థల ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడులకు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ తోట సత్యవాణి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలలు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విశేషంగా అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మలికిపురం: మండలంలో సోమవారం కృష్ణాష్టమి ఉత్సవాలు అంబరాన్నంటాయి. వివిధ గ్రామాల్లో పలుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లపాలెం గ్రామంలో తిరుపతి నుంచి వచ్చిన కోలాటం బృందం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం భక్తులు ఉట్టి కొట్టే కార్యక్రమాలలో భారీగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

రావులపాలెం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే పలువురు చిన్నారులకు కృష్ణుడు వేషధారణలు వేయించి ఉట్టి కొట్టించారు.

రేపు కొబ్బరి రైతుల సమ్మేళనం



మామిడికుదురులో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చిస్తున్న ఎండీ వేణుగోపాల్

మామిడికుదురు: ఈ నెల 28న అమలాపురంలో కొబ్బరి పంటపై కొబ్బరి రైతుల సమ్మేళనం జరుగుతుందని మామిడికుదురు నారియల్ న్యూట్ర ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎండీ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 28వ తేదీన గండువారి వీధిలోని కాపు కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు కొబ్బరి పంటపై జాతీయ, రాష్ట్ర స్థాయి వ్యవస్థలు తీసుకోవాల్సిన ముఖ్య చర్యలపై దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కొబ్బరి రైతులతో చర్చిస్తారన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. రైతులు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమ్మేళనంలో కొబ్బరికి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా జాతీయ స్థాయిలో కొబ్బరి ధరలు నిర్ధారించాలని, కొబ్బరి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు రైతులకు ప్రభుత్వ పరంగా చేయూత నందించాలని, కొబ్బరిలో పంటకు సోకే తెగుళ్లపై జరుగుతున్న పరిశోధన ఫలితాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించనున్నామన్నారు. ఈ సమావేశంలో యెరుబండి లక్ష్మయ్య, మసూద్ మొహిద్దీన్, పెదమల్లు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కొత్తపేట వీహెచ్‌పీ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కొత్తపేట: హిందువులు అందరూ ఐకమత్యంగా నిలిచి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ స్థాపన జరిగి ఈ కృష్ణాష్టమికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ జిల్లా మందిర అర్చక ప్రముఖ్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సభకు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కిరెడ్డి మాట్లాడుతూ హిందువులు తమ కులాన్ని ఇంటికే పరిమితం చేసుకుని బయట మాత్రం హిందువులం, బంధువులుగా మెలగాలన్నారు. ఐకమత్యంగా హిందూ ధర్మాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గోవిందు, కోశాధికారి నూలు శ్యామల, హిందూ సంపర్క ప్రముఖ్ జెల్లి సర్వలక్ష్మి, రిటైర్డ్ ఎంఈఓ ఏడిద సత్తిరాజు, బీజేపీ జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

508 కలశాలతో శ్రీకృష్ణునికి మహా అభిషేకం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభూ సుందరశ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ ఈ వేడుకలకు హాజరయ్యారు. సుందర శ్రీనివాస్‌దాస్ శ్రీకృష్ణుడు లీలలను ప్రవచించారు. సాయంత్రం ఉట్టి సంబరం వేడుకలను జరిపారు. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకూ స్వామికి విశేష పూజలు జరిపారు. 508 కలశాలతో మహాభిషేకం, మహా భోగనివేదన, మహాహారతి వంటి విశేష క్రతువులు జరిపారు. అదే విధంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మండలంలోని అయినవిల్లి, నేదునూరు, విలస, తొత్తరమూడి తదితర గ్రామాల్లో ఘనంగా జరిపారు.

ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పురిగొళ్ల రఘురామ్ పేర్కొన్నారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో సోమవారం మండల శాఖ అధ్యక్షులు మెండా ఆదినారాయణ ఆధ్యక్షతన జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు పర్యవేక్షణలో కార్యకర్తల సమావేశం జరిగింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి సభ్యత్వాల నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ప్రతి బూత్‌కు 200 సభ్యత్వాలు నమోదు చేయాలన్నది లక్ష్యమని రఘురామ్ తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై గ్రామ స్థాయిలో ప్రచారం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీని మరింత బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. దీన్ని ఒక చాలెంజ్‌గా తీసుకుని రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలూరి సత్యానందం, పార్టీ నేతలు మోకా వెంకట సుబ్బారావు, పసుపులేటి మహలక్ష్మీరావు, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు, పాలూరి జయప్రకాష్, కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ లక్ష్యాలు పూర్తి చేయండి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో మండల పార్టీ బీజేపీ శాఖ సమావేశం సోమవారం అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కంకిపాటి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వాల నమోదును విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మండల సభ్యత్వ ప్రముఖ్‌లుగా ఇందుకూరి అచ్యుతరామరాజు, అడబాల నరసింహారావు, గెద్దాడ సత్యనారాయణలను నియమించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: వచ్చే నెల ఒకటి నుంచి మొదలయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం గొందిలో పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో సీనియర్ నాయకులు మాలే శ్రీనివాస నగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం సందర్శన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజులు సోమవారం సందర్శించారు. వసతి గృహం పనితీరును పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతి గృహంలో తాగునీరు సక్రమంగా లేదని ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు జెడ్పీటీసీకు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సంపదరావు, సర్పంచ్ చిన్నవరాజు వసతి గృహంలో తయారుచేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఘనంగా మదర్‌థెరిసా జయంతి



కొత్తపేట ఆస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు



అంబాజీపేటలో మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



సంధిపూడిలో మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గ్రామస్తులు



మలికిపురంలో వృద్ధులకు పండ్లు ఇస్తున్న బి.రుూన్సీ

అలమూరు: ప్రముఖ సామాజిక, సంఘ సేవకురాలు మదర్ థెరిసా జయంతి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. సంధిపూడి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం మదర్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మదర్ థెరిసా విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోనున్న మదర్ థెరిసా విగ్రహాల వద్ద జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. మదర్ థెరిసా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సంధిపూడి సర్పంచ్ తోట భవాని పిలుపునిచ్చారు.

అంబాజీపేట: ప్రపంచానికి సేవా మార్గం చాటి విశ్వమాతలా మదర్‌థెరిసా పేరుగాంచారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, సొసైటీ మాజీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబులు అన్నారు. థెరిసా జయంతి సందర్భంగా అంబాజీపేట హైస్కూల్ ఎదురుగా ఉన్న థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలికిపురం: మానవసేవే మాధవసేవగా భావించిన ×మాతసేవ మూర్తి, సంఘ సేవకురాలు మదర్ థెరిసా అని మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు బత్తుల ఝాన్సీ పేర్కొన్నారు. థెరిసా పుట్టినరోజు సందర్భంగా మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురం వద్దుల ఆశ్రమం నందు వృద్ధుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు రోటరీ క్లబ్ సభ్యులు పళ్లు, పాలు, నిత్యావసరాలు సమకూర్చి అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మట్టా రవికుమార్, కోశాధికారి తోలేటి సతీష్ రొటేరియన్ గుబ్బల బాబ్జి, నల్లి శివకుమార్, డాక్టర్ గొల్ల జేసురత్నం, బందెల సంపత్‌కుమార్, చంద్రమౌళి, వృద్ధాశ్రమ సిస్టర్స్ పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో సోమవారం రాజోలు తాలూకా వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మదర్‌థెరిసా జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద సమాఖ్య అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు మాట్లాడుతూ శాంతి, సాహసం, ప్రేమకు ప్రతిరూపమైన భారత రత్న మదర్‌థెరిసా సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

కొత్తపేట: మదర్ థెరిసా జయంతి సందర్భంగా స్థానిక విద్యా బాలమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో మదర్ థెరిసా చిత్రపటానికి, పంచాయతీ పార్కులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సుమారు 70 మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్ ఆర్‌కే అనూరాధ, ప్రిన్సిపాల్ నూకపేయి శివరత్నం పాల్గొన్నారు.

రావులపాలెం ఎస్సైగా చంటి



రావులపాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా జి.చంటి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రాజేష్ బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో అమలాపురం టౌన్ నుంచి చంటి బదిలీపై రావులపాలెం వచ్చారు. బాధ్యతలు చేపట్టిన చంటిని టౌన్ సీఐ జేమ్స్ రత్నప్రసాద్, ఇతర సిబ్బంది అభినందించారు.

మహా సంప్రోక్షణ ఉత్సవాలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసియున్న శ్రీశ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈఆలయాన్ని రూ 40 లక్షల వ్యయంతో పునః నిర్మించిన సందర్భంగా మూడు రోజుల పాటు మహా సంప్రోక్షణ ఉత్సవాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రముఖ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన గ్రామానికి చెందిన వంక వీర వెంకట సత్యనారాయణ మూర్తి, తులసీ గంగాభవానీ దంపతులు పీటలపై కూర్చుని పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మహా సంప్రోక్షణలో తొలి ఘట్టమైన గణపతి హోమాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యం చెందారు.

ఇమామ్ హుస్సేన్ పరివారానికి నివాళి

మామిడికుదురు: సత్యం, ధర్మం, న్యాయం, కోసం 72 మంది పరివారంతో పాటు తన ప్రాణాలను సైతం అర్పించిన ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్‌కు సోమవారం ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. ఇమామ్ హుస్సేన్ అర్బయీన్ (అమరత్వం పొందిన 40వ రోజు) సందర్భంగా గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరం బడేబీబీ పంజాలో ఈ సందర్భంగా మజ్లిస్ జరిగింది. మంజిలే కర్బలాలో గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో అర్బయీన్ కార్యక్రమం జరిగింది. నగరం పంజీషా వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మామిడికుదురు వరకు పీరును ఊరేగించారు. హజరత్ అబ్బాస్ పంజాలో కూడా మజ్లిస్ జరిగింది. కార్యక్రమాల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. పలు భక్త బృందాలు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశాయి.

లొల్ల లాకుల ఆధునీకరణ చేపట్టాలి



లొల్ల లాకులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకూ రహదారి పూర్తిగా పాడైందని, ఆ రహదారిని కలెక్టర్ నిధులతో అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని లొల్ల లాకులను కలెక్టర్ పరిశీలించారు. లొల్ల లాకులు శిథిలావస్థకు చేరిన అంశాన్ని కలెక్టర్‌కు ఆయన వివరించారు. కోనసీమ రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని లొల్ల లాకుల ఆధునీకరణను వెంటనే చేపట్టాలని అన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై 28వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి సోమవారం తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 95819 32678 సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. అమలాపురం డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.